నేడు బాలల హక్కుల కమిషన్ పర్యటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు, సభ్యులు గొండు సీతారాం ఈనెల 8వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కలిసి బాలల హక్కులు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. 11 గంటలకు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకుని, ఈనెల 16న రథసప్తమి వేడుకల్లో బాలలకు కల్పించనున్న సదుపాయాలపై పలు శాఖల అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీకాకుళం నగరంలోని కెజిబివిని, మూడు గంటలకు రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి పిల్లల వైద్య నిపుణులతో సమీక్షిస్తారు.

సాగునీటికి సారీ

- ప్రధాన ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించని ప్రభుత్వం
- వంశధారకు గత బడ్జెట్‌లో రూ.180.73 కోట్లు కేటాయింపు
- ప్రభుత్వం విడుదల చేసింది రూ.24.31 కోట్లే
- మిగతా ప్రాజెక్టులదీ అదే పరిస్థితి

హిరమండలం వద్ద అసంపూర్తిగా ఉన్న వంశధార రిజర్వాయర్

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయాలన్న లక్ష్యం ప్రభుత్వానికి లేనట్లుగా కనిపిస్తోంది. బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకపోవడం, కేటాయించినా ఆ మేరకు నిధులు విడుదల చేయడం లేదు. ప్రాజెక్టులకు విడుదల చేస్తున్న నిధులను ఖర్చు చేయడంలోనూ ప్రభుత్వ ఉదాసీనత కనబరుస్తోంది. జిల్లాలోని కొన్ని ప్రధాన ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రాధాన్యత జాబితాలో చేర్చినా వాటికీ నిధులు కేటాయించడం లేదు. వంశధార స్టేజ్-2, ఫేజ్ -2, ఆఫ్‌షోర్, మడ్డువలస, నదుల అనుసంధానం పనులకూ డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లోనూ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొంది తప్ప నిధుల కేటాయింపు ప్రస్తావన చేయకపోవడం జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వంశధార ప్రాజెక్టు ఫేజ్-2, స్టేజ్-2 ప్రభుత్వం ప్రాధాన్యత ప్రాజెక్టులో చేర్చినా, ఆమేరకు నిధులు విడుదల చేయలేదు. 2023-24 బడ్జెట్‌లో రూ.180.73 కోట్లను కేటాయించింది. అందులో రూ.24.31 కోట్లను విడుదల చేసింది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్న నమ్మకంతో అధికారులు కాంట్రాక్టర్లతో రూ.40.67 కోట్ల మేర పనులు చేయించారు. ఆ బిల్లులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం డ్యామ్‌లు, పనులకు రూ.110 కోట్లు కేటాయించగా, అందులో రూ.24.26 కోట్లను విడుదల చేసింది. భూసేకరణ కోసం రూ.84 లక్షలు కేటాయించగా బడ్జెట్‌లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందనే నమ్మకంతో అధికారులు కాంట్రాక్టర్లతో రూ.1.52 కోట్ల పనులు చేయించారు. ఇప్పటివరకు ఆ బిల్లులను చెల్లించలేదు. నిర్వాసితులకు ఎక్స్‌గ్రేషియో కింద చెల్లించాల్సిన నిధులనూ విడుదల చేయలేదు. బడ్జెట్‌లో రూ.67.17 కోట్లను కేటాయించినా, ఇప్పటివరకు విడుదల చేయలేదు. వంశధార స్టేజ్-1 గత బడ్జెట్‌లో కేటాయింపులు చేసినా రిక్తహస్తమే చూపింది. కాలువలు, డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ.5.91 లక్షలు కేటాయించినా ఒక్క పైసా విడుదల చేయలేదు. అదే ప్రాజెక్టులో డ్యామ్‌లు, ఇతర సంబంధిత పనులకు రూ.3.89 లక్షలను కేటాయించినా నిధులు విడుదల చేయలేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.82.45 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి.

మిగతా ప్రాజెక్టులదీ అదే పరిస్థితి

జిల్లాలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మాటల్లో చెప్పినా చేతల్లో మాత్రం కనిపించడం లేదు. బడ్జెట్‌లో ఆ మేరకు నిధులు కేటాయించడం లేదు. 2023-24 బడ్జెట్‌లో ఆఫ్‌షోర్‌కు 9.35 కోట్ల మేర కేటాయింపులు చేసింది. ఇప్పటివరకు ఒక్క పైసా విడుదల చేయలేదు. అధికారులు కాంట్రాక్టర్లతో రూ.7.52 కోట్ల మేర పనులు చేయించారు. పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రిజర్వాయర్‌కు సంబంధించి డ్యామ్‌లు, ఇతర పనులకు రూ.7.55 కోట్లు కేటాయించినా ఒక్క రూపాయి విడుదల చేయలేదు. నిర్వాసితులకు చెల్లింపులకు రూ.1.25 కోట్లను ఇవ్వలేదు. పునరావాసం, పరిహారం పనులకు రూ.54 లక్షలు కేటాయించినా నిధులు విడుదల చేయలేదు. మడ్డువలస స్టేజ్-1, స్టేజ్-2 రిజర్వాయర్ పనులకు కేవలం రూ.70 లక్షలే ప్రభుత్వం విడుదల చేసింది.



నిధుల ఊసే లేని కరకట్టల పనులు

జిల్లాలో కరకట్టల పనులకు సంబంధించి అధికారులు అనేక పర్యాయాలు ప్రతిపాదనలు పంపినా బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు మొత్తం రూ.37.65 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు నివేదిక పంపారు. వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలకు కొర్రీలు వేస్తూ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదు.

నిధుల ప్రస్తావన లేని పలు ప్రాజెక్టులు

బడ్జెట్‌లో మూలపేట పోర్టు వ్యయం, పూర్తి, ఉపాధి అంశాలను ప్రస్తావించిన ప్రభుత్వం నిధుల కేటాయింపుపై మాత్రం ప్రస్తావన లేదు. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన రూ.వంద కోట్లను మాత్రం విడుదల చేసింది. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌ను ప్రభుత్వం నిర్మిస్తోందంటూ ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొన్నా గతేడాది బడ్జెట్‌లో ఒక్క రూపాయి విడుదల చేయలేదు.

ఎల్ఎన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు

చలో విజయవాడ భగ్నానికి యత్నం

ఎక్కడికక్కడ ఆశావర్కర్ల అరెస్టులు, గృహ నిర్బంధాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కనీస వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆశావర్కర్లు ఈనెల ఎనిమిదో తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమ భగ్నానికి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించింది. ఆశావర్కర్లు విజయవాడ వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ వారిని ముందస్తు అరెస్టులు చేశారు. కొందరిని గృహ నిర్బంధం చేయగా, మరికొందరికి నోటీసులు ఇచ్చారు. చలో విజయవాడలో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి హాజరు కాబోమని ఆశావర్కర్ల నుంచి సంతకాలను తీసుకునేందుకు ప్రయత్నించారు. జిల్లాలో సుమారు 400 నుంచి 500 మంది ఆశావర్కర్లను ఉదయం ఏడు గంటల నుంచే అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. విజయవాడ వెళ్తున్న కొందరిని మార్గమధ్యంలో అరెస్టు చేశారు. రాత్రి ఏడు గంటల తర్వాత వారిని ఇళ్లకు విడిచిపెట్టారు. గార మండలం నుంచి ప్రయివేట్ బస్సులో బయలుదేరిన ఆశావర్కర్లను రణస్థలం వద్ద పోలీసులు బస్సు నుంచి దించేశారు.

ఆశావర్కర్ల అక్రమ అరెస్టులను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంతో చెప్పుకునేందుకు వెళ్తున్న వారిని అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. మహిళలనీ చూడకుండా గృహ నిర్బంధాలు, అరెస్టులకు పాల్పడడం దారుణమని తెలిపారు. ఆశా వర్కర్లపై జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ప్రజలు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

డిఎస్‌సి వచ్చేసింది

- జిల్లాలో 101 పోస్టులకు నోటిఫికేషన్
- 12న ఉద్యోగ ప్రకటన విడుదల
- ఈనెల 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 7వ తేదీన పరీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఇదిగో డిఎస్‌సి, అదిగో నోటిఫికేషన్ అంటూ ఊరిస్తూ వచ్చిన ప్రభుత్వం ఎట్టకేలకు ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 12 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుందని వెల్లడించారు. ఆ రోజు నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏప్రిల్ ఏడో తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6,100 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. అందులో జిల్లాకు సంబంధించి 101 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఈనెల 12న విడుదలయ్యే నోటిఫికేషన్‌లో జిల్లాల వారీగా ఖాళీల వివరాలను పొందుపరచనున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం 101 పోస్టుల్లో సెకండరీ గ్రేడ్ పోస్టులు 14, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 87 ఉన్నట్లు తెలిసింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులో ఇంగ్లీష్ 21, గణితం 12, భౌతికశాస్త్రం ఒకటి, బయలాజికల్ సైన్స్ 14, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులు 32 ఉండగా స్కూల్ అసిస్టెంట్ ఫస్ట్ లాంగ్వేజ్‌లో నాలుగు, సెకండ్ లాంగ్వేజ్‌లో మూడు పోస్టులకు ఉద్యోగ ప్రకటన జారీ చేయనున్నారని తెలిసింది.

టెట్ పరీక్షకు 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ

టెట్ పరీక్షకు సంబంధించి ప్రభుత్వం డిఎస్‌సితో పాటే షెడ్యూల్‌నూ వెలువరించింది. ఈనెల 8న టెట్ పరీక్ష ప్రకటన విడుదల చేసి 17వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ నెల 27, వచ్చే నెల తొమ్మిదో తేదీన రెండు విడతల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మార్చి 14న ఫలితాలను ప్రకటించనున్నారు.

శిక్షణా సంస్థల వైపు పరుగులు

డిఎస్‌సి నోటిఫికేషన్ వస్తుందన్న ఆశతో జిల్లావ్యాప్తంగా వేల సంఖ్యలో అభ్యర్థులు పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్నారు. కొందరు ఇంటి వద్దే శిక్షణ పొందుతుంటే, అత్యధికులు కృష్ణా జిల్లా అవనిగడ్డకు పయనమవుతున్నారు. మరికొంత మంది శ్రీకాకుళం, విజయనగరం, నంద్యాల, రాజమండ్రి, కాకినాడ కేంద్రాల్లో నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రాల్లో చేరేందుకు సమాయత్తమవుతున్నారు.

41 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - పలాస

గంజాయిని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

ఒడిశా నుంచి బీహార్‌కు తరలిస్తున్న రూ.1.20 లక్షల 41 కేజీల గంజాయిని పలాస రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న బీహార్‌కు చెందిన ఆకాష్ కుమార్, ప్రేమజిత్ కుమార్‌ను అరెస్టు చేశారు. పలాస రైల్వేస్టేషన్‌లోని జిఆర్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశాఖపట్నం లైన్స్ రైల్వే సిఐ కె.వెంకటరావు వివరాలను వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, బంగారం, గంజాయి అక్రమ రవాణాపై విస్తృత తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పలాస రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలపై తనిఖీ చేయగా ఆకాష్ కుమార్, ప్రేమజిత్ కుమార్ బ్యాగుల్లో గంజాయి బయటపడిందన్నారు. 41 కిలోల గంజాయి రూ.1.20 లక్షల విలువ ఉంటుందని తెలిపారు. వీరు బీహార్‌కు గంజాయిని రైలులో తరలించే క్రమంలో తనిఖీల్లో పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ షరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీ మృతి

ప్రజాశక్తి - నందిగాం

రోదిస్తున్న కుటుంబసభ్యులు

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన ఉపాధి హామీ కూలీ గౌడు జగదీశ్వరి (30) బుధవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దిమ్మిడిజోల సమీపంలోని సవరాపురం చెరువులో ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ఈ పనులకు వెళ్తున్న జగదీశ్వరి ఆలస్యం కావడంతో తొందరగా వెళ్లేందుకు అటువైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి ఎక్కింది. గ్రామ శివారుకు వచ్చేసరికి ట్రాక్టర్‌పై నుంచి జారిపడడంతో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త దుర్యోధన, కుమారుడు శరణ్, కుమార్తె హిమబిందు ఉన్నారు. కుమారుడు దిమ్మిడిజోలలో నాలుగో తరగతి, కుమార్తె డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ తెలిపారు.

కొండపల్లిలో ఎలుగు సంచారం

వజ్రపుకొత్తూరు : మండలంలోని చీపురుపల్లి పంచాయతీ కొండపల్లిలో బుధవారం ఎలుగుబంటి సంచరించడంతో ప్రజలు హడలిపోయారు. ఉదయం పది గంటల సమయంలో కొండపై నుంచి దిగిన ఎలుగు ప్రాథమిక పాఠశాల పక్క నుంచి వెళ్లింది. పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు ఒకేచోట ఉండగా, అందులో 30 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఎలుగు సంచరించే సమయంలో పిల్లలు ఎవరూ బయట లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. నాలుగు రోజుల కిందట అక్కుపల్లికి చెందిన మోస చిన్న ధనరాజు, మడ్డు జోగారావు వేకువజామున వాకింగ్‌కు వెళ్తుండగా, తోట నుంచి వచ్చిన రెండు ఎలుగులు వారిపై దాడికి ప్రయత్నించాయని స్థానికులు చెప్పారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి (ఎఎల్ఎంటి) మాస్టర్ ట్రైనర్స్ శిక్షణా తరగతులను జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు ముందుగా మాక్ పోల్ నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. త్వరలోనే నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇవిఎంలు, బ్యాలెట్ యూనిట్ తదితర వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణా తరగతులకు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్, మెప్మా పీడీ కిరణ్ కుమార్ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ డైరీ తదితర అంశాలను వివరించారు. మొత్తం ఓటర్లు, లోక్‌సభ, శాసనసభలకు సంబంధించి వేర్వేరుగా ఏజెంట్లు ఉంటారని తెలిపారు. అభ్యర్థుల పేర్లు స్పష్టంగా కనిపించే విధంగా చూడాలన్నారు. మాక్ పోలింగ్ ఓట్లు సరిపోయిందీ, లేనిదీ చూడాలని చెప్పారు. పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్, మాక్ పోలింగ్‌పై అందరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండి నియోజకవర్గ స్థాయిలో శిక్షణా తరగతులకు హాజరు కావాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై డ్వామా పీడీ, మాస్టర్ ట్రైనర్ జి.వి చిట్టిరాజు అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి రామ్మోహనరావు, పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, ఎలక్షన్ డిటిలు, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న చేపట్టే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జిషీట్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల ఇంటింటికీ వెళ్లి క్యాంపెయిన్ చేయాలన్నారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత స్థాయిలో నిర్ణయించాయని తెలిపారు. ఎన్నికలకు ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. నిరుద్యోగం పెరిగి, శ్రామికుల నిజవేతనాలు 20 శాతానికి తగ్గాయన్నారు. ఉపాధి హామీని నిర్వీర్యం చూస్తూ కేటాయింపుల్లో కోతలు పెట్టిందన్నారు. సమావేశంలో శ్రామిక మహిళా జిల్లా కో కన్వీనర్ ఎ.మహాలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య ఎం.ఆదినారాయణమూర్తి, కోశాధికారి ఎ.సత్యనారాయణ, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న అప్పలసూర్యనారాయణ

ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ భూ హక్కు చట్టాన్ని నిరసిస్తూ 50 రోజులుగా భూహక్కు చట్టాన్ని నిరసిస్తూ న్యాయవాదులు పలురూపాల్లో ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ చట్టం అమల్లోకి వస్తే సామాన్యులు అనేక ఇబ్బందులు పడతారని తెలిపారు. న్యాయస్థానాలనూ ఆశ్రయించే అవకాశం కోల్పోతారని చెప్పారు. ఇప్పటికే ఈ చట్టంపై న్యాయస్థానాల్లో దావాలు వేసినట్లు తెలిపారు. తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షకు మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని హామీనిచ్చారు. దీక్షలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్ని సూర్యారావు, పొన్నాడ రాము, న్యాయవాదులు ఎం.భవానీప్రసాద్, కె.పార్థసారథి, కె.సూర్యనారాయణ, పి.వి రవి కూర్చొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు వాన కృష్ణచంద్, కూన రాజారావు తదితరులు పాల్గొన్నారు.

దగా కాదు... మెగా డిఎస్‌సి కావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరకొర ఉపాధ్యాయ పోస్టులతో దగా డిఎస్‌సిని రద్దు చేసి, మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 25 వేల ఉపాధ్యాయ పోస్టులకు మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు జనసేన నాయకులు పి.కోటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని మెగా డిఎస్‌సి ద్వారా భర్తీ చేస్తామని చెప్పి 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో అప్రెంటిస్ విధానాన్ని తీసుకొచ్చి నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మొత్తం ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు ఎ.రాము, అరవింద్, కర్ణ వీరుడు, తులసీరావు, జనసేన నాయకులు వెలమల రాము, సాయి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి ఏర్పాట్లు పరిశీలన

శ్రీకాకుళం : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 16న నిర్వహించే రథసప్తమి ఉత్సవ ఏర్పాట్లను ఎస్‌పి జి.ఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. పార్కింగ్, ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాత్రికులు, విఐపిలు, వివిఐపిలు, దాతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ ప్రవేశం వద్దకు చేరుకునే క్యూలైన్లతో పాటు ట్రాఫిక్, విఐపి వాహనాల రాక, రక్షణ వలయాలు ఏర్పాటు, చిన్న పిల్లలు, వృద్ధుల ప్రవేశానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్, డిఎస్‌పి వై.శృతి, ట్రాఫిక్ సిఐ అవతారం, ఒకటో పట్టణ సిఐ ఎల్.ఎస్ నాయుడు, ఎస్ఐ బి.గణేష్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT NARASANNAPETA. O.S. 123/2022.

Between: **Ravada Pottanna** ...Plaintiff
And: **Yernagula Rama Rao and another** ...Respondents

To,
Yarnagula Prasanth, S/o Rama rao , Hindu, Aged 33 years, Business, R/o D.No. 6-12, Bhavanipuram street, Narasannapeta Town and Mandal, Srikakulam District.

Take notice that the above named Plaintiff has instituted the above suit against you for the recovery of Pro note amount Rs.2,00,000 and accrued interest there on till the date of filing of suit Rs.63,333/-. The total principal and interest amount is Rs.2,63,333/-. Your are here by summoned to appear before the Honourable Court in person on the **15th March, 2024 at 10.30 am.** In default of your appearance on the day afore mentioned, the case will be heard and determined in your absence.

// BY ORDER OF THE COURT //

PRAGADA ANANDA RAO,
ADVOCATE,
NARASANNAPETA, SRIKAKULAM,
ANDHRA PRADESH,
CELL NO.95506 09585.

మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ఆర్థిక ఇబ్బందుల్లో ఇపిఎస్ పెన్షనర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశవ్యాప్తంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇపిఎస్ పెన్షనర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నగరంలో జ్యోతిరావు పూలే పార్క్ వద్ద మూడోరోజు చేపట్టారు. ఈ శిబిరాన్ని బుధవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇపిఎస్ పెన్షనర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రూ.వెయ్యి, రూ.2వేలుతో కరువు భత్యం లేకుండా జీవనం సాధ్యం కాదని, సుప్రీంకోర్టు సైతం ఇపిఎస్ పెన్షన్‌దారులకు పెన్షన్ పెంచాలని సూచించినా ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కనీస పెన్షన్ రూ.9 వేలు, కరువు భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత వైద్య సదుపాయం అందించాలని, వృద్ధులకు గతంలో ఇచ్చిన రైల్వే రాయితీని పునరుద్ధరించాలని కోరారు. ఇపిఎస్ పెన్షనర్ల ఆందోళన కార్యక్రమానికి సిఐటియు తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బిఎస్‌యన్‌ఎల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.గోవర్ధన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక విధానాలతో రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ శిబిరంలో ఎం.సూర్యనారాయణ, కె.కృష్ణ, పి.గోపాలరావు, పి.సత్యనారాయణ, వి.ధర్మయ్య పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో క్రీడా పోటీలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు 2౩24 ఏడాది వార్షిక క్రీడలను క్రీడాజ్యోతిని వెలిగించి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐతమ్ విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలని కోరారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విజయాలు సాధించిన వారు సైతం జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. ఫిబ్రవరి 7 నుంచి 29 వరకు జరిగే ఈ పోటీల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలన్నారు. మొట్ట మొదటిగా సిఎస్ఇ, ఇఇఇ ఫుట్‌బాల్ టీంలు తలపడగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. ఈ క్రీడా ప్రారంభోత్సవంలో డీన్లు డాక్టర్ డి.విజయకుమార్, డాక్టర్ డి.ఆజాద్, డాక్టర్ బి.వి.రమణ, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మన్మథరావు,హెచ్ఒడిలు డాక్టర్ డి.శ్రీరాములు, డాక్టర్ యు.డి.ప్రసన్న, డాక్టర్ పి.దినకర్, డాక్టర్ బి.రామారావు, డాక్టర్ వై.రమేష్, డాక్టర్ కె. కిరణ్‌కుమార్, డాక్టర్ ఆర్.శాంతికుమార్, డాక్టర్ బి.శివకుమార్ల, స్పోర్ట్స్ కన్వీనర్ డాక్టర్ పి.మురళీధర్, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహన్, జె.తేజశ్వరి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- పలాస

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బుధవారం లింగ నిర్ధారణ చట్టం అమలుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడ మగ నిష్పత్తిని అందరూ బాధ్యతగా తీసుకొని తగ్గించాలని కోరారు. శారీరిక, మానసిక హింస చేయరాదన్నారు. సామాజిక కట్టుబాట్లు, రుగ్మతలు, మూఢనమ్మకాలు రూపుమాపి, స్కానింగ్ సెంటర్ల పర్యవేక్షణ అవసరమని అన్నారు. కార్యక్రమంలో జె.సూర్యనారాయణ, డాక్టర్ తమ్మినేని పాపినాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.వెంకటరావు, డాక్టర్ బి.గౌతమి, డాక్టర్ దేవి, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనేల గోపాల్, డిపిఎంఒ వి.సురేష్‌కుమార్, డిఇఎంఒ వెంకటేశ్వర్లు, కో-ఆర్డినేటర్ సూర్యకళ, సూపర్‌వైజర్ ఎన్.ఋషికేశ్వరారావు, కె.సీతారామ్మూర్తి, ఎన్.సీతాదేవి, టి.నర్మద, ఆర్.జాస్మిన్‌కుమారి, గ్రీన్ ఆర్మీ సభ్యులు బెందాళ శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రసవాలు పెంచేలా కృషి

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు పెంచేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఒ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల తీరు తెన్నులను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎల్లప్పుడూ ప్రజలకు అన్ని మందులు అందుబాటులో ఉండేవిధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన ఆస్పత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు అంజలి, దేవి, డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, ఇఒ వెంకట్రావు, అనురాధ పాల్గొన్నారు.

పలాస : అవగాహన కల్పిస్తున్న ప్రసాదరావు

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులే జర్నలిస్టులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులే జర్నలిస్టులని సిఐ విజయ వాయునందన్ యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని వన్ వే జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై గళాన్ని వినిపిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ నిజాన్ని నిర్భయంగా తెలియజేయడమే జర్నలిస్టు విధి అని అన్నారు. జర్నలిస్టులు ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎన్‌ఐజె జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సత్తారు భాస్కరరావు మాట్లాడుతూ పాత్రికేయ మిత్రులు ఐకమత్యంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. ప్రభుత్వాలు పాత్రికేయుల సంక్షేమం విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని పాత్రికేయులు ఉమ్మడిగా పోరాడి సాధించుకోవాలన్నారు. ప్రెస్‌క్లబ్ నూతన భవనాన్ని తొందర్లోనే నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సువ్వారి గాంధీ, కోట గోవిందరావు, సువ్వారి సత్యనారాయణ, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు మురళీధరరావు పాల్గొన్నారు.

భాస్కరరావును సత్కరిస్తున్న జర్నలిస్టులు

పథకాలు నిలిపివేయడం సరికాదు

వినతిపత్రం అందజేస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మండలంలోని సరియాపల్లిలో ఇటీవల టిడిపిలో చేరిన వారికి ప్రభుత్వ పథకాలు నిలిపి వేయడం దారుణమని, తక్షణమే వారికి సంక్షేమ పథకాలను యథావిధిగా అందించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష డిమాండ్ చేశారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం టిడిపిలో చేరిన లబ్దిదారులకు వైఎస్ఆర్ పింఛను కానుక, చేయూత పథకాలు వర్తింపచేయాలని ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నుంచి టిడిపిలో చేరడంతో పింఛను కానుక లబ్ధిదారులు బెండి నల్లయ్య, బెండి ఈశ్వరమ్మ, నీటిపల్లి నవ్య, బెండి రాజారావు, బెండి ఈశ్వరమ్మ, పసుపురెడ్డి రాంబాబు, చేయూత బత్తిని రాజులమ్మ, పసుపురెడ్డి జగదాంబ, నీటిపల్లి రాజేశ్వరి, బెండి యల్లిమ్మలకు పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పారని, ఏలా పథకాలు నిలిపి వేస్తారని ప్రశ్నించారు. పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నామని చెప్పి నిజమైన లబ్ధిదారులకు పథకాలు నిలిపి వేయడం దారుణమన్నారు. తక్షణమే పునరుద్ధరణ చేయకపోతే కార్యాలయం ఎదుట ధర్నాలు, దీక్షలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, బూరెల కృష్ణంరాజు, వడ్డీ యాదగిరి, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

11న కోటబొమ్మాళి మండల సమావేశం

కోటబొమ్మాళి: ఈ నెల 11 మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఎచ్చెర్ల పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పూర్తి సమాచారంలో అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

దుకాణదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

టెక్కలి రూరల్ : టెక్కలి డివిజన్‌లో గల కార్మికశాఖ పరిధిలో అన్ని దుకాణదారులు మీ సేవా, గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవాలని టెక్కలి సహాయ కార్మిక కమిషనర్ జి.ఎల్లాజిరావు ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాల్లో కార్మికులు ఉన్నను, లేకున్ననూ వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెలాఖరిలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సంఘీభావం తెలుపుతున్న ప్రసాదరావు

ఎన్నాళ్లీ నిరీక్షణ

కవిటి: గుర్తింపు కోసం ఇంకా ఎన్నేళ్ల నిరీక్షించాలని బెంతు ఒరియాలు ప్రశ్నించారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ బిడ్డలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని, నిరుద్యోగులు ఉద్యోగ అర్హత కోల్పోతున్నారని, కూలీనాలీ చేసి బతుకుతున్న తమకు ప్రభుత్వ పథకాలు అందకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పరిష్కారం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అందులో భాగంగా 42వ రోజు చేపడుతున దీక్షలో తిప్పనపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే విశ్రాంత డిఎస్‌పి ప్రసాదరావు, ఈదుపురం మాజీ ఎంపిటిసి బోర రాజేంద్రప్రసాద్, అంబటి శంకర్, తిప్పనపుట్టుగ మాజీ సర్పంచ్ తిప్పన దాలయ్య దీక్షలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మోహన్‌సాహు, వాసుదేవ్ బిసాయి, జయసేన్ బిసాయి, దేవ్, దుదిస్టి బిసాయి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు కింద పడి వ్యక్తి మృతి

పలాస : పలాస రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో కిష్టుపురం రైల్వే గేటుకు సమీపంలో ఒడిశా రాష్ట్రం గురండికి చెందిన నల్ల తారకేశ్వరరావు (53) బుధవారం రైలు కింద పడి మృతి చెందాడు. ఆయన కుమార్తె వివాహానికి సంబంధించి బ్రాహ్మణతర్లాలో పెళ్లి దస్తులు, వంట సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు రైల్వే ఎస్ఐ షరీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బస్సును ఢీకొన్న లారీ

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- నందిగాం

మండలం లోని పెద్దబానాపురం జాతీయ రహదారి 16పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన ఆర్‌టిసి ఆర్డినరీ బస్సు పలాస వెళ్తుంది. పెద్దబానాపురం స్టేజ్‌లో పాసింజర్లు దిగుతున్నారు. ఈ సమయంలో ఆగి ఉన్న బస్సును లారీ కుడి భాగం నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో నందిగామ మండలం చిన్నపల్లికి చెందిన కాశీ రాము, అనంతపురానికి చెందిన గొల్లపల్లి లతశ్రీ, సారవకోటకు చెందిన జిన్ని ఉపేంద్రలు గాయపడ్డారు. వెంటనే జాతీయ రహదారి అంబులెన్స్‌లో రామును టెక్కలి జిల్లా ఆస్పత్రి, మిగతా ఇద్దరిని పలాస ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సును ఢీకొన్న లారీ

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక తెంబూరు రోడ్డులోని వలియాసాగరం సమీపంలో బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... టెక్కలికి చెందిన కూన చంద్రశేఖర్, అతని స్నేహితుడు బమ్మిడి వినోద్ ద్విచక్రవాహనంపై సీతాపురం వైపు వెళ్తున్నారు. అలాగే మండలంలోని జీడిపేటకు చెందిన మంగపేట కృష్ణారావు, ఆనంద్‌లు ఎదురుగా వస్తున్న క్రమంలో బలంగా ఢీకొనడం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అందులో చంద్రశేఖర్, వినోద్‌లకు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. సిఐ పి.పైడయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

టెక్కలి రూరల్: మండలంలోని విక్రంపురంలోని మంకినమ్మ, ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం అర్ధరాత్రి మంకినమ్మ విగ్రహానికి ఉన్న 1.5 తులాలు పుస్తెలతాడు, ముక్కుపుడక, కాసులు, 40 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైంది. మారామలింగేశ్వరస్వామి ఆలయంలో కేజీన్నర వెండి ఆభరణాలతో పాటు హుండీ నగదు సుమారు రూ.40 వేలు చోరీకి గురైంది. ఈ మేరకు పోలీసులు, క్లూస్ టీం బృందం ఆలయాల్లో ఆధారాలను సేకరించారు. రెండు చోరీలపై సిఐ పి.పైడయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న టిడిపి నాయకులు

రాపాకలో 'భవిష్యత్ గ్యారెంటీ'

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని మండల టిడిపి అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ అన్నారు. మండలం రాపాకలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న పలు సంక్షేమ పథకాలు వివరిస్తూ పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, టిడిపి నాయకులు కొంచాడ రమేష్, మనోహర్, పైడి వాసు, కండాపు శ్రీనివాసరావు, వైకుంఠరావు, చేపల అప్పలనాయుడు, దన్నాన శ్రీను, పాల్గొన్నారు.

వడ్డీ చెల్లించాలి

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా తీసుకున్న రుణాలు చెల్లించి ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ రాయితీలు పొందాలని డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ పాలకొండ బాబ్జీరావు అన్నారు. బుధవారం పాలవలస గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 90 గ్రామాల్లో క్రాఫ్‌లోన్లు ఈ సంఘం ద్వారా 1800 మంది రైతులు తీసుకున్నట్లు తెలిపారు. రుణాలు తీసుకుని రెన్యువల్ చేయని 600 మంది రైతులకు నోటీసులు అందజేశామని, నోటీసులు అనంతరం ప్రతిఒక్కరి ఇంటికి వెళ్లి తీసుకున్న రుణంపై ఏడు శాతం వడ్డీ చెల్లించి ప్రభుత్వం ఇస్తున్న సున్నా వడ్డీలు ప్రతిఒక్కరు పొందాలని కోరారు. రుణాలు తీసుకుని సంవత్సరాలు పైబడి కట్టకుంటే అధిక వడ్డీలు పడతాయని, ప్రతిఒక్క రైతు గ్రహించి సకాలంలో తీసుకున్న రుణాలు, వడ్డీ చెల్లించాలని ఆయన కోరారు. అలాగే మండలంలో రెండు టీంలుగా వెళ్లి అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈయనతో పాటు చీఫ్ మేనేజర్ వి.వి. రఘు, సూపర్‌వైజర్ కృష్ణ, పిఏసిఎస్ సిబ్బంది ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ బాబ్జీరావు

'కాంతిస్తంభం' పుస్తకావిష్కరణ

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్ : జూనియర్ ఛాంబర్స్ సేవలు గడచిన మూడు దశాబ్దాలుగా కొనసాగిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. బుధవారం ప్రభుత్వ పురుషుల కళాశాలలో పత్తి సుమతి రాసిన కాంతిస్తంభం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ పురుషుల అల్యూమిని అసోసియేషన్, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్, వ్యవస్థాపకులు జామి భీమశంకర్ ఆధ్వర్యాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలనాటి క్రాంతిదర్శి ప్రిన్సిపాల్ మేజర్ నదీముల్లా జీవితాన్ని ప్రతిస్పదించి పత్తి సుమతి రచించిన 'కాంతి స్తంభం' పుస్తకం స్ఫూర్తినిచ్చేదిగా ఉందన్నారు. జెసిఐ వ్యవస్థాపకులు జామి భీమశంకర్ మాట్లాడుతూ పత్తి సుమతి రచనలు అందర్ని ఆకట్టుకునే రీతిలో ఉన్నాయన్నారు. ఆమె రచించిన చీమ చీమ ఎందుకు పుట్టావు పుస్తకానికి తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యాన ఉగాది పురస్కారాన్ని అందుకున్నారని గుర్తుచేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సురేఖ మాట్లాడుతూ సుమతి రచనలు యావత్ ప్రపంచానికి ఆలోచింపజేసే విధంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో దూసి సంతోష్, బి.మధు, ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు, టి.మణికంఠ, సూరంగి మోహనరావు, దుంపల సన్యాసిరావు, విజికె మూర్తి పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే రోడ్ల అభివృద్ధి

ప్రజాశక్తి- కొత్తూరు

నియోజకవర్గంలోని ఎమ్మెల్యే రెడ్డి శాంతి గిరిజన గ్రామాల రోడ్ల అభివృద్ధికి కృషి చేశారని వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ అన్నారు. స్థానిక పిఎసిఎస్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రూ.6.50 కోట్లతో మెట్టూరు నుంచి దెప్పిగూడ, రూ.1.50 కోట్లతో పుల్లగూడ నుంచి దెప్పిగూడ, రూ.18 లక్షలతో కాకరగూడ నుంచి ఉల్లిమానుగూడ, రూ.1.30 కోట్లతో దిమిలి పంచాయతీలో కాకరగూడ, రూ.1.20 కోట్లతో లబ్బ నుంచి దొండమానుగూడ. రూ.90 లక్షలతో అల్తి నుంచి రెల్లిగూడ, రూ.కోటితో రాయ నుంచి తింపతిగూడ, రూ.1.50 కోట్లతో అల్తి పంచాయతీ నుంచి రెల్లిగూడ, రూ.1.50 కోట్లతో పుట్టిగాం నుంచి అబలాసింగి, రూ.60 లక్షలతో దిమిలి నుంచి బొడ్లగూడ వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ పి.సాధుబాబు, వై.ధర్మారావు వైసిపి నాయకులు. జి.ఆనందరావు, జి.రాజులు నాయుడు, డి.అప్పన్న, పాపారావు, సింహాద్రి, వెంకటరావు, పంకాజ్‌దాస్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాదరావు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కార్యకర్తలతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, టెక్కలి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు పూజారి శైలజలు అన్నారు. మండలంలోని కిష్టుపురం పంచాయతీ జనసేన టెక్కలి నియోజకవర్గ నాయకులు పల్లి కోటేశ్వరరావు, టిడిపి నాయకులు కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే ఆడ బిడ్డ నిధి కింద రూ.18 ఏళ్లుపూర్తయిన మహిళలకు రూ.1500, తల్లికి వందనం కింద ఇంటిలో ఎంత మంది విద్యనభ్యసిస్తే వారందరికీ రూ.15 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని వివరించారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా, ఆర్‌టిసి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం టిడిపి ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు మండల టీడీపీ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రొక్కం అచ్యుతరావు (దొర)ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్ట సింహాచలం, నాళ్ల అదినారాయణ, కర్రి అప్పారావు, శిమ్మ సింహాచలం, నంబాళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీతారాంనాయుడు

ప్రజాశక్తి- పలాస

ఆర్‌టిసి సేవలను విస్తృతం చేసేందుకు లక్కీ డ్రా నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ రోణంకి సీతారాంనాయుడు అన్నారు. పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద మూడు బస్సు రూట్లో బుధవారం లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి రూట్లో పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మాతల, రెండో రూట్లో

ఆర్‌టిసి సేవలు విస్తృతం

పొత్తంగి, మూడో రూట్లో ఘటి బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు తమ బస్సు టిక్కెట్లను, ఫోన్ నంబర్లను రాశామని అన్నారు. ఇలా ప్రతి 15 రోజులకొకసారి లక్కీ డ్రా తీసేస్తున్నామని తెలిపారు. డ్రాలో ప్రతి రూట్లోనూ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో బహుమతులు అందజేస్తామని చెప్పారు. వీరికి లక్కీ షాపింగ్ మాల్ గెలుపొందిన ప్రతి విజేతకూ రూ.వెయ్యి విలువ చేసే కూపన్ ఇస్తామని అన్నారు. వీటిని పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దకు వచ్చి కూపన్లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్కీ షాపింగ్ మాల్ మేనేజర్ శ్రీహరి, ఆర్‌టిసి ట్రాఫిక్ సిఐ పినకాన సంతోష్ కుమార్, ఉద్యోగులు డి.శ్రీనివాసరావు, సి.ఎం.రావు, కామరాజు, ధర్మారావు పాల్గొన్నారు.

విజేతలు వీరే

ఘటి రూట్ ప్రథమ, ద్వితీయ స్థానంలో నౌపడ రాజేశ్వరి, తమ్మిరెడ్డి, పొత్తంగి రూట్లో రుక్మిణి, యు.రోజా, పాతపట్నం రూట్లో భామిని త్రినాథ్, పార్వతీశంలు విజేతలుగా నిలిచారు. వీరికి పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దకు వచ్చి బహుమతులు తీసుకోవాలని తెలిపారు.

మాట్లాడుతున్న కోణార్క్ శ్రీను

ఫ్యాక్టరీ ధరలకే బంగారు ఆభరణాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారులకు ఫ్యాక్టరీ ధరలకే నాణ్యమైన, సరికొత్త డిజైన్లతో కూడిన బంగారు ఆభరణాలు అందించడం వి జ్యువెలరీ మార్ట్ ప్రత్యేకతని కళింగ కోమటి సంఘ రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని గ్రాండ్ హోటల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా తన కుటుంబ సభ్యులు, వ్యాపార వృత్తిలో కొనసాగుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. అదే నమ్మకంతో కొత్తగా వీ జ్యువెలరీ మార్ట్‌లో భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. ఈనెల 11న వీ జ్యువెలరీ మార్ట్ విశాఖపట్నంలో మేఘాలయ పక్కన నవరత్న ట్రేడ్ సెంటర్ భవనంలో ఆరోఫ్లోర్‌లో నెలకొల్పుతున్నట్లు తెలిపారు. బంగారం వ్యాపారంలో కూడా తనను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి ఉన్న వినీత్, నరసన్నపేట కళింగ కోమటి పట్టణ అధ్యక్షులు ఉన్న పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బొంగి శివప్రసాద్, డాక్టర్ సంపతిరావు శ్రీదేవి దంపతులు రూ.లక్ష విలువ చేసే మూడు ఇన్వెర్టర్లను ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి సందీప శర్మలకు అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన కె.ఇందిర నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. నెఫ్ట్ రూపంలో అరసవల్లి దేవస్థానం ఖాతాకు జమ చేయడం జరిగిందని ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

రూ.1.40 లక్షలకు వేలం పాట ఖరారు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో కోడూరు పంచాయతీ పరిధిలోని జీడి తోట ఫలసాయానికి వేలం పాట రూ.1.40 లక్షలకు ఖరారైందని ఎంపిడిఒ ఉష్రశ్రీ పారు. మండల పరిషత్ కార్యాలయంలో 2023-24 సంవత్సరానికి పంట పలసాయం పొందేందుకు బుధవారం వేలం పాట నిర్వహించారు. అందులో చింతాడ ఉమ రూ.1.40 లక్షలకు పంట పాడారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఉరజాం సర్పంచ్ కణితి సత్తిబాబు, ఎస్.నగేష్, జి.దాలయ్య పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ సూర్యప్రకాష్

రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

సంతబొమ్మాళి : శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి వసంతరెడ్డి

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని తోటవాడ నుంచి గొల్లలవస వరకు రూ.75 లక్షలతో బిటి రోడ్డు పనులకు ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు బుధవారం ప్రారంభించారు. అలాగే రెండు కిలోమీటర్ల పొడవు తోటాడ కూడలి నుంచి గొల్లలవలస కాలనీ సచివాలయం వరకు వేస్తున్నట్లు తెలిపారు. పనులు నిర్వాహణలో నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పంచిరెడ్డి జగన్, ఎంపిటిసి ప్రతినిధి సూరపు జయరాంనాయుడు, కార్యదర్శి వాన రోహిణి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని నరసాపురం ఎస్‌సి శ్మశానానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణ పనులకు జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెడ్‌పి నిధులు రూ.5 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి, వైసిపి నాయకులు ఎర్నాగుల జానకిరావు, డొక్కరి మల్లేష్, కూరాకుల అప్పారావు, రమేష్, కృష్ణారావు, లచ్చయ్య పాల్గొన్నారు.

రామ్‌మల్లిక్ నాయుడు పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలో ఇజ్జాడపాలెం శిగురుకొత్తపల్లి గ్రామాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు బుధవారం పలు కుటుంబాలను పరామర్శించారు. శిగురు కొత్తపల్లి మాజీ సర్పంచ్ కోనేటి శ్రీనువాసరావు చిన్నాన్న కోనేటి జగ్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే గోవిందపురం పంచాయతీ ఇజ్జడపాళెం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కర్రోతు శ్రీనువాసరావు తండ్రి ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, కోనేటి శ్రీనువాసరావు, పిన్నింటి మధుబాబు, ఇజ్జు వెంకటేశ్వరరావు, బాబూరావు, అప్పలనాయుడు, రామకుమార్ ఉన్నారు.

పరామర్శిస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

ప్రజాశక్తి- పాతపట్నం

ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో పాతపట్నం ఉప కారాగారాన్ని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఖైదీలందరితో మాట్లాడి వారి మయస్సుతో పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మైనర్లు ఉంటే వారిని పెద్దలు నిర్బంధించే కారాగారంలో నిర్బంధించరాదని, మైనర్లకు నిర్దేశించే ప్రత్యేకమైన హోమ్‌లో ఉంచాలని సిబ్బందికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దాయిలకు న్యాయవాదిని పెట్టుకునే ఆర్థికస్తోమత లేకపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని నియమిస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్ జైలర్ జి.రాము, న్యాయవాది పాల్గునరావు, పారా లీగల్ వాలంటీర్లు, జైలు సిబ్బంది, ముద్దాయిలు ఉన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న పావని

78 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బూర్జ

మండల డొంకలపర్త గ్రామంలో బుధవారం బూర్జ పిహెచ్ వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో 78 మందికి వైద్యసేవలు అందించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలం వస్తుందని ప్రతిఒక్కరూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 వరకు చల్లని ప్రాంతాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిఒ రాధిక, ఎఎన్ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ మెఖలింగం, వెంకటరమణ, ఆశావర్కర్లు రూప రాణి, అసిరి నాయుడు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ఆటలాడుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతంపేట

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ విమర్శించారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌పై నిరుద్యోగ యువతతో సీతంపేటలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక టిడిపి కార్యాలయం నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది మెగా డిఎస్‌సి కాదని, దగా డిఎస్‌సి అని ధ్వజమెత్తారు. ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తామని హామీనిచ్చి, పూర్తిగా విస్మరించారని విమర్శించారు.

నిరుద్యోగ యువతతో ఆటలాడుకుంటున్న సిఎం జగన్‌కి గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో ఇంటికి పంపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, బిసి సెల్ అధ్యక్షులు ఆర్ రంగనాథం, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గంట సుధ, ఐటిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇమరక పవన్, తెలుగు యువత అధ్యక్షులు సవర సంతోష్ కుమార్, ప్రచారకర్త తోయక సంధ్యారాణి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నిమ్మక చంద్రశేఖర్, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మోనోపాజ్ తరువాత మహిళలను ఇబ్బంది పెట్టే సమస్యల్లో ఆస్టియోపోరోసిస్ (బోలు ఎముకల వ్యాధి) ఒకటని ప్రముఖ సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డా.ఎం.పార్థసారథి అన్నారు. నగరంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్దగల హెల్త్ కేర్ మల్టి స్పెషాలిటీ వైద్యశాలలో బుధవారం ఉచిత బోలు ఎముకల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. చాలా ఖర్చుతో కూడుకున్న పరీక్షలను ప్రజలందరికీ ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఉచిత నిర్ధారణ పరీక్షలను నిర్వహించామని, విశేష స్పందన లభించటం హర్షనీయమన్నారు. మోనోపాజ్ తరువాత మహిళలను ఇబ్బంది పెట్టే సమస్యల్లో ఆస్టియోపోరోసిస్ ఒకటన్నారు. ఎముక సాంద్రత తగ్గి, పటుత్వం కోల్పోయి అవి గుల్లబారతాయన్నారు. యాభై ఏళ్ల వయసు పైబడ్డ వారిలో ప్రతి ముగ్గిరిలో ఒకరికి ఇటువంటి సమస్య ఉందన్నారు. జీవనశైలిలో మార్పులు, పౌషకాహారం తీసుకోవడం, సరైన వ్యాయామం చేయడం, వ్యాధిని తొలిదశలో గుర్తించడం వలన ఈ సమస్య నుంచి

మాట్లాడుతున్న వైద్యులు

బయటపడే అవకాశం ఉంటుందన్నారు. స్టెరాయిడ్స్, ఫిట్స్ మందులు, అధికంగా ఆల్కహాల్ తీసుకోవడం, పొగతాగడం, శారీరక శ్రమ లేకపోవడం, అతి తక్కువ బరువు, కాల్షియం, విటమిన్ డి లోపం వల్ల కూడా ఈవ్యాధి రావచ్చన్నారు. నడకతో ఆరోగ్యం పదిలమని, ప్రతిరోజు 20 నుండి 30 నిమిషాలు వ్యాయామం చేయడంతో సంపూర్ణ ఆరోగ్యమన్నారు. ఈశిబిరంలో ఎంజిఆర్ హెల్త్ కేర్ మల్టీస్పెషల్టీ వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ మామిడి సాయి గణేష్ , ప్రముఖ వైద్యులు డాక్టర్ శశిధర్, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బ్యాంకుల పనితీరు, ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షల పట్ల విద్యార్థులు అవగహన కలిగి ఉండాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. బుధవారం కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యాన విద్యార్థులకు 'బ్యాంకింగ్ అవేర్నెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక లావాదేవీలు, అకౌంటింగ్ విధానం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ సుదీపా సాహు, క్యాషియర్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల్లో

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

రుణాలు పొందడం వలన తక్కువ శాతం వడ్డీతో అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఎల్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కామర్స్ అధ్యాపకులు లలితబాయి, సంతోషి పట్నాయక్, పావని పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో శిరీష

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పెసరపాడులో వైసిపి నుంచి మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయరావుతో పలువురు బుధవారం టిడిపిలో చేరారు. వీరికి టిడిపి కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి నాయకుల అరాచకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టిడిపి ప్రవేశ పెట్టనున్న పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో రోణంకి కురమయ్య, రోణంకి మోహనరావు, రోణంకి రమేష్, కుర్మపు మన్మధరావు, కుర్మపు ప్రకాష్, కుర్మపు తిరుపతిరావు, కుర్మపు అప్పారావు, టేకి పాపారావు, ధర్మపురి అప్పలస్వామి, పొన్నాడ జోగారావులు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు టంకాల రవి శంకర్ గుప్తా, బి.నాగరాజు, కొవ్వూరు సురేష్‌కుమార్, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని తులిసిగాంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక గడపగడపా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి

మాట్లాడుతున్న విజయ

ఉప్పడ నారాయణమ్మ, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్.బాబూరావు, చాట్ల తులసీదాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష కార్డులను అందజేస్తున్న స్వర్ణమణి

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష'

ఇచ్ఛాపురం: పేదలకు వరం ఆరోగ్య సురక్ష అని మున్సిపల్ వైస్ చైర్‌సర్పన్ లాభాల స్వర్ణమణి అన్నారు. పట్టణంలోని ఒరియా స్కూల్ బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిఎం జగన్ నిత్యం ప్రజల బాగోగుల గురించి ఆలోచిస్తారని అన్నారు. అనంతరం ఆరోగ్య కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, వార్డు కౌన్సిలర్లు పి.మధుమూర్తి, బచ్చ జగన్, బర్ల కృష్ణరావు, పటాన కృష్ణ, నందికా సోమేష్, పి.హరికృష్ణ, పి.నీలాద్రి, శంకరకుమార్ పాల్గొన్నారు.

నివాళ్లర్పిస్తున్న ఎయిమ్స్ ప్రతినిధులు

ఘనంగా రమాబాయి జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సతీమణి రమాబాయి భీంరావ్ సేవలు స్పూర్తిదాయకమని ఎయిమ్స్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను అన్నారు. బుధవారం ఆమె జయంతి వేడుకలను జ్యోతిరావు పూలే పార్క్‌లో నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ లక్ష్య సాధనకు ఆమె తోడుగా నిలిచారన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా వాటి ప్రభావం అంబేద్కర్‌పై పడకుండా ముందుకు సాగారన్నారు. కార్యక్రమంలో సింకు రమణ, పురుషోత్తం, రాంబాబు, నేతల అప్పారావు, రాజు, పి మహేష్ పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న జగన్నాథరావు

'108' వాహనం తనిఖీ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో 108 సేవల పనితీరుపై టెక్కలి డివిజన్ అధికారి జగన్నాథరావు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో 108 సేవలు ఎలా అందిస్తున్నారు, అత్యవసర కేసులో చికిత్సా అందించేందుకు అవసరమైన మందులు, ఇతర పరికరాలు ఉన్నాయా? లేవా? పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది వి.గోవిందరావు, ఎల్.సూరిబాబు, యు.బాలకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న తిరుమలరావు

ట్యాబ్‌ల పంపిణీ

పలాస : వైసిపి ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేస్తుందని, విద్యార్థులకు విద్యా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ట్యాబ్‌లను పంపిణీ చేస్తుందని రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు అన్నారు. పలాస మండలం రెంటికోట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దువ్వాడ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఇచ్ఛాపురం : మండలంలోని ధర్మపురానికి చెందిన సోమేష్ రెడ్డి పోలెండ్ దేశంలో గతేడాది డిసెంబరులో మృతి చెందారు. ఈ మేరకు పోలాండ్ దేశంలోని జిల్లా తెలుగు సంఘం నేతలు తన భుజాలపై వేసుకున్నారు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా, వారి కుటుంబ భవిష్యత్ కోసం, అతని భార్య, 8 నెలల పాపను ఆదుకోవడానికి నిధుల సేకరణ చేశారు. రెండు విడుతలుగా రూ.1.50 లక్షలు చొప్పున మృతిడి కుమార్తె పేరున పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను బుధవారం అందజేశారు.

బాండ్లను అందజేస్తున్న ప్రతినిధులు